సర్కార్ బడిలోనే సక్కనైన విద్య

- సకల సౌకర్యాలతోపాటు నైపుణ్యం గల ఉపాధ్యాయులు
- ముందస్తు బడిబాటలో తల్లిదండ్రులకు అవగాహన
- గ్రామాల్లో ఇంటింటా ప్రచారం



సర్కార్ బడిలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

మానకొండూర్: ప్రతి విద్యా సంవత్సరం బడిబాట కార్యక్రమం మొదలైయ్యేనాటికే గ్రామాల్లోని విద్యార్థులను ప్రైవేటు స్కూళ్లలో చేర్చుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గిపోవడమే కాకుండా ఉపాధ్యాయులు చేపట్టిన బడిబాటకు ఫలితం లేకుండా పోతోంది. బడిలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటేనే రెట్టింపు ఉత్సాహంతో విద్యను అందించవచ్చనే ఉద్దేశంతో మండలంలోని లింగాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఈ విద్యా సంవత్సరం ముగియక ముందే ముందస్తు చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారుల అనుమతి మేరకూ ముందస్తు బడిబాటకు శ్రీకారం చుట్టారు. పాఠశాలలో 72 మంది విద్యార్థులు, తొమ్మిది మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ ఏడాది ఏడో తరగతి పూర్తి చేసుకునే పది మంది విద్యార్థులు పైతరగతులకు వెళ్లనున్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గకుండా, ప్రైవేటు పాఠశాలలవైపు మొగ్గుచూపకుండా బడిబాటలో ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్తూ మేము మీ పిల్లల కోసమే ఉన్నాం.. మీ పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు పంపించకండి. నాణ్యమైన, గుణాత్మక విద్య సర్కార్ బడుల్లోనే లభిస్తోది, మీ పిల్లలకు ఎలాంటి చదువు కావాలో మాతో చెప్పండి, విద్యార్థులు సరిగా చదవకపోతే ప్రశ్నించండి అంటూ ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ బడికి పంపుతామని చెప్పేవారి వివరాలు నమోదు చేసుకుంటున్నారు.

నాణ్యమైన విద్య మాదే బాధ్యత

ప్రభుత్వం అనేక మౌలిక వసతులు కల్పిస్తూ ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయని, మంచి విద్యను అందించే ఉపాధ్యాయులు ఉన్నారని ముందస్తు బడిబాటలో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. చదువుతోపాటు పండుగలు, సంస్కృతి, సాంప్రదాయాలు సంబంధించి అనేక కార్యక్రమాలు చేపట్టి విద్యార్థుల్లో ఉత్సాహం నింపుతున్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం, ఐఐటీ, నీట్ ఫౌండేషన్ కోర్సులను ప్రారంభిస్తామని హామీ ఇస్తూ విద్యార్థుల సంఖ్య పెంచుకునేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. 'పిల్లల తల్లిదండ్రులకు విద్యా ఆవశ్యకతను తెలియజేస్తున్నాం, ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఎన్ని విధాలుగా ప్రయోజనం పొందవచ్చో వివరిస్తున్నాం. ప్రభుత్వం ఉచిత విద్య, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం అందిస్తున్నామని చెబుతున్నాం. చదువు 'కొనే' విధంగా కాకుండా, చదువుకునే విధంగా చేయండి అంటూ కోరుతున్నాం. ముందస్తు బడిబాటలో ఇప్పటికే 36 మంది విద్యార్థులు పాఠశాలలో చేరేందుకు మొగ్గ చూపారని ఉపాధ్యాయులు తెలిపారు'.

వసతులు మెరుగయ్యాయి



ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుంది. వసతులు మెరుగయ్యాయి. నైపుణ్యం గల టీచర్లు చదువు చెబుతారు. ప్రైవేటు స్కూళ్లు వేసవిలో క్యాంపెయినింగ్ చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చేరితే ఫీజు రాయితీ, బస్సు సౌకర్యం కల్పిస్తామంటూ విద్యార్థులను నమోదు చేసుకుంటూ తల్లిదండ్రుల అంగీకారం తీసుకుంటున్నారని ముందస్తుగా బడిబాట చేపట్టాం.

– శ్రీనివాస జియ్యంగార్, హెచ్ఎం, లింగాపూర్

క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరిక



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట: పట్టణంలోని 22వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద రాజేశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ వార్డు యువజన సంఘం అధ్యక్షుడు కనకం రత్నాకర్ శుక్రవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, వార్డు నాయకులు ఎర్ర సతీశ్, ఎండీ సల్మాన్, ఎర్ర వంశీ, వడ్లూరి శశి, అంబాల అరుణ్, కనుకం హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

హుజూరాబాద్: మండలంలోని రాంపూర్ గ్రామంలో శుక్రవారం హన్మకొండ జిల్లా ఎస్ఆర్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ విద్యార్థులు పర్యటించారు. గ్రామంలోని రైతులకు సోషల్ మ్యాపింగ్, వివిధ వ్యవసాయం భాగస్వామ్య పద్ధతులు ఉపయోగించే విధానం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ మహేశ్, కోఆర్డినేటర్ విష్ణువర్ధన్, అగ్రికల్చర్ డీన్ డాక్టర్ భూపాల్ తదితరులున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పైలెట్ ప్రాజెక్టు కింద గ్రామాన్ని ఎంపిక చేసి వంద మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతోపాటు బేస్‌మెంట్ వరకు పనులు చేసినవారి ఖాతాల్లో డబ్బులు జమ చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులతో పాటు గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల, మాజీ సర్పంచ్ కోల రమేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు షూ



క్రీడాకారులతో ఎస్సై వంశీకృష్ణ, తదితరులు

గంగాధర: గంగాధరకు చెందిన 16 మంది క్రికెట్ క్రీడాకారులకు గ్రామానికే చెందిన ప్రవీణ్‌రావు షూ సమకూర్చగా శుక్రవారం ఎస్సై వంశీకృష్ణ క్రీడాకారులకు అందజేశారు. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు వ్యక్తుల మధ్య స్నేహభావం పెంపొందిస్తాయన్నారు. పట్టుదలతో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. దురలవాట్లకు బానిసలై బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఠాగూర్, ఉప్పుల గంగన్న, క్రీడాకారులు గంట విజయ్, కట్ల శ్రీనివాస్, గుజ్జేటి లవకుమార్, శశికిరణ్, ఉపేందర్, వివేక్, ప్రణయ్, నరేశ్, రామకృష్ణ, మధుకర్, ప్రదీప్, సాయిచరణ్, అభిరానందన్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రాములు

శంకరపట్నం: ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం సందర్భంగా ప్రొటోకాల్ పాటించని వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని తాడికల్ సహకార సంఘం డైరెక్టర్ రాములు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో తాడికల్, కేశవపట్నం, కరీంపేటలో శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని, ఫ్లెక్సీలో కాంగ్రెస్ నాయకుల ఫొటోలు మాత్రమే ముద్రించారని, కరీంనగర్ ఎంపీ, కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ఫొటోను ఏర్పాటు చేయలేదని చైర్మన్ మధుకర్ రెడ్డి, సీఈవో వీరస్వామిపై చర్యలు తీసుకోవాలన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర





కేశవపట్నంలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, చొప్పదండిలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మానకొండూర్: రైతులను ఆదుకుంటున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో తాలు, తేమ, తరుగు వంటి కోతలు ఉండవని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని, దళారుల బారినపడకుండా ఉండేందుకు వరి, పత్తి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు రూ.ఐదువందల బోనస్, ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరీ, పార్టీ మండల అధ్యక్షుడు రవీంద్రాచారి, ఏఎంసీ చైర్మన్ మల్రి ఓదెలు, వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం/తిమ్మాపూర్: మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. తాడికల్, కరీంపేట, కేశవపట్నంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, తాడికల్ విండో చైర్మన్ మధుకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, మాజీ సర్పంచ్‌లు బస్వయ్య, తిరుపతిపాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

చొప్పదండి: రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలోని కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. నిర్వాహకులు రైతులను ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. అనంతరం వెదురుగట్టులో జై భీం, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్ మహేశ్, ఉపాధ్యక్షుడు రాజేందర్, పీఏసీఎస్ ఇంచార్జి లక్ష్మణాచారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జమున, డీటీ ఉష, మున్సిపల్ మాజీ చైర్మన్ గుర్రం నీరజ, కొండగట్టు దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరాఫరా బంద్

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు, మొలంగూర్ సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనుల కారణంగా శనివారం విద్యుత్ సరాఫరా అంతరాయం ఉంటుందని ఏఈ రఘు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మొలంగూర్, చింతలపల్లి, గుడాటిపల్లి, నల్లవెంకయ్యపల్లి, రాజాపూర్, కొత్తగట్టు, లింగాపూర్, గొల్లపల్లి గ్రామాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీపీఐ నూతన కమిటీ



నూతన కార్యవర్గ సభ్యులు, నాయకులు

గన్నేరువరం: సీపీఐ గన్నేరువరం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. కూన మల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యదర్శిగా బోయిని మల్లయ్య, సహాయ కార్యదర్శులుగా బొమ్మకంటి ఆంజనేయులు, కూన మల్లయ్య, కోశాధికారిగా పబ్బతి సాగర్‌రెడ్డి, కార్యవర్గసభ్యులుగా బొమ్మకంటి సదానందం, న్యాత కొమురయ్య, జాలి గోపయ్య నియామకమయ్యారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, కార్యకర్తలు కళ్లెం రవి, గూడూరి రాజయ్య, కడమంచి వెంకటేశం, బొమ్మకంటి మల్లేశం, బొమ్మకంటి రాజు పాల్గొన్నారు.

విద్యారంగ సంస్కరణలు సరికాదు



మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, తదితరులు

కరీంనగర్: గత ప్రభుత్వం ఏలుబడిలో దశాబ్దకాలంలో పాఠశాల విద్యరంగం విధ్వంసమైందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సంస్కరణల పేరిట పాఠశాలల కుదింపుకు, మూసివేతకు కుట్రలు చేస్తోందని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య ఉద్ఘాటించారు. జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి అధ్యక్షతన శుక్రవారం జరిగిన డీటీఎఫ్ జిల్లా 15వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి డీటీఎఫ్ సంఘ సంస్థాగత, విద్యారంగ, ఉపాధ్యాయ, సామాజిక సమస్యల కార్యకలాపాల వార్షిక నివేదికను సమర్పించారు. సోమయ్య మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్య తక్కువ ఉందనే నెపంతో పాఠశాలల సంఖ్యను తగ్గించి, మండలానికి ఐదు లేదా ఆరు ప్రాథమిక పాఠశాలలు, మూడు లేదా నాలుగు ఉన్నత పాఠశాలలు మాత్రమే ఉనికిలో ఉండేలా ప్రభుత్వం విద్యా కమిషన్ ద్వారా ప్రయత్నాలు చేస్తోందన్నారు. విద్యా ప్రైవేటీకరణ విధానాలను అడ్డుకోవాలని కోరారు. డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజిరెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ డీఈవోపై పెండింగ్‌లో ఉన్న రెండు విచారణ నివేదికల మేరకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అటుకుల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణ కోసం జరిగే ఉద్యమాలను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.ఈశ్వర్‌రెడ్డి, రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కే.నారాయణరెడ్డి, ఎం.రఘుశంకర్‌రెడ్డి, పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.సంతోష్ రెడ్డి, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, గర్ జిల్లా ఉపాధ్యక్షుడు కే. రాజమౌళి, సభ్యులు పాల్గొన్నారు.

మంద కృష్ణ మాదిగను కలిసిన జమ్మికుంట మార్కెట్ చైర్ పర్సన్



మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న స్వప్న

జమ్మికుంట: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగను జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న శుక్రవారం మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఎస్సీ వర్గీకరణ సాధ్యమైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛం శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు వెంకటస్వామి, మార్కెట్ డైరెక్టర్ ఎగ్గెటి సదానందం తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్: తోకలపల్లి గ్రామంలో శిలువ మోస్తున్న పాస్టర్

ఏసుక్రీస్తు మహనీయుడు

హుజూరాబాద్: నియోజకవర్గ వ్యాప్తంగా క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే నిర్వహించుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని చెల్పూర్ గ్రామపంచాయతీ పరిధి తోకపల్లి గ్రామంలో పాస్టర్ జెకార్య శిలువ మోశారు. లోక పాపములు తొలగించడానికి ఏసు శిలువ ఎక్కాడని పేర్కొన్నారు. అనంతరం చర్చిల్లో పాస్టర్లు దైవ సందేశం వినిపించారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని మారుతినగర్‌లో గెన్సమనే ప్రార్థన మందిరంలో పాస్టర్ జోజి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే ఘనంగా జరుపుకున్నారు. పాస్టర్ మాట్లాడుతూ క్రీస్తు సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. ఏసుక్రీస్తు మహా నీయుడని కొనియాడారు. కార్యక్రమంలో ఇల్లందుల భద్రయ్య, వరికొప్పుల కొండయ్య, రామనాథ, ఎర్ర సారయ్య, రమేశ్, కుమార్, ఎల్లస్వామి, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలోని హోలీషాలోం చర్చిలో గుడ్ ఫ్రైడే పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక గీతాలు ఆలపించారు. జనులు దేవుని మార్గములో నాడుచుకోవాలని పాస్టర్ సందేశం ఇచ్చారు. చర్చి ఫౌండర్ గుండేటి శాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.



జమ్మికుంట: ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైసవులు



చొప్పదండి: దైవ సందేశం అందిస్తున్న పాస్టర్

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

చొప్పదండి: అగ్ని ప్రమాదాల నివారణపై మండల కేంద్రంలోని రైస్ మిల్లులు, పెట్రోల్ బంకుల ఆవరణలో చొప్పదండి అగ్నిమాపకశాఖ అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా కార్యక్రమం చేపట్టామన్నారు. అనుకోకుండా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను యజమానులు, వర్కర్లకు ఫైర్ అధికారి పి.పవన్ తెలియజేశారు. కార్యక్రమంలో ఎం.కిసన్, డి.సాగర్, టి.సందీప్, కె. సతీశ్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు

సన్మానం



సన్మానిస్తున్న వివిధ సంఘాల నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని చాణక్య డిగ్రీ కళాశాలలో తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దళిత రత్న అవార్డు గ్రహీత బత్తుల పాండును శుక్రవారం ఘనంగా సన్మానించారు. దళిత బహుజనుల ఆకాంక్షలకు అనుగుణంగా ఉద్యమాల్లో పాల్గొనందుకు, అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్న పాండు అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ రవీంద్రభారతిలో దళితరత్న అవార్డును ప్రభుత్వ అధికారుల చేతుమీదుగా అందుకున్నారు. సన్మానించిన వారిలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దబ్బెట రవీందర్, వివిధ సంఘాల నాయకులు రాచపల్లి సాగర్, పాతకాల సంపత్, మైస సాంబయ్య, రాచపల్లి వంశీకుమార్, పల్లెర్ల కమలాకర్, బత్తుల రామకృష్ణ, గడ్డం భార్గవ్, రాజేందర్, రౌతు ప్రసన్నకుమార్, రఘు, కొలుగూరి రవీందర్, మొలుగూరి రాజేందర్, శనిగరపు మధు, జూకంటి రాజేందర్, శశి పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడికి..

గన్నేరువరం: ఇటీవల జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి నాగరాజు గెలుపొందారు. ఖాసీంపేట, పారువెల్ల గ్రామాల్లోని మానసాదేవి, లక్ష్మీగణపతి ఆలయాల చైర్మన్లు ఏలేటి చంద్రారెడ్డి, బద్దం తిరుపతిరెడ్డి శుక్రవారం కరీంనగర్‌లో పుష్పగుచ్ఛం, శాలువాలతో సన్మానించారు. అనంతరం అధ్యక్షుడిగా గెలుపొందడం మండలానికి గర్వకారణమని, భవిష్యత్ మరింత ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.



నాగరాజును సన్మానిస్తున్న చంద్రారెడ్డి, తిరుపతిరెడ్డి

అర్హులకు పథకాలు అందించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

శంకరపట్నం: పేదలకు ప్రభుత్వ పథకాలు అందించాలని శుక్రవారం టీడీపీ నాయకులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్‌యువవికాసం, రేషన్‌కార్డులు అర్హులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోరె ప్రభాకర్, బైరి తిరుపతి, గోపి వీరమల్లు, షాబీర్, వెంకటేశ్, కృష్ణ, శ్యాం, కదిరె కొంరయ్య, వెంకన్న పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు



మాట్లాడుతున్న పశువైద్య సిబ్బంది

హుజూరాబాద్: మండలంలోని మాందాడిపల్లి గ్రామంలో శుక్రవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాల వేశామని మండల పశువైద్యాధికారి డాక్టర్ పి. రవీందర్‌రెడ్డి తెలిపారు. అనంతరం మాట్లాడారు. పాడి రైతులు తప్పనిసరి పశువులకు టీకాలను వేయించాలని సూచించారు.

కారును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

తిమ్మాపూర్: మండలంలోని రేణికుంట టోల్ ప్లాజా వద్ద హైదరాబాద్ వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు ఢీ కొట్టింది దానికి సంబంధించిన సీసీ ఫుటేజ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బస్సు కంట్రోల్ కాకపోవడంతోనే కారును వెనుక నుంచి ఢీ కొట్టినట్టు కనిపిస్తోంది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించారు. కాగా సీసీ ఫుటేజీ వీడియో చూసిన నెటిజన్లు ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంగానే ప్రమాదం జరిగినట్లు కామెంట్ చేస్తున్నారు.

క్రైం వార్తలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జమ్మికుంట: ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. టౌన్ సీఐ రవి తెలిపిన వివరాలు... మండలంలోని శాయంపేట గ్రామానికి చెందిన మడికొండ శ్రీనివాస్‌రావు(49) ఈ నెల 15న ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులు, తాగుడుకు బానిసై ఆత్మహత్యకు పాల్పడ్డాడని, మృతుడి భార్య లత ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మానకొండూర్: మండల కేంద్రంలో కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై శుక్రవారం లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. సూర్యాపేట డిపోకు చెందిన బస్సు కరీంనగర్ నుంచి వరంగల్‌వైపు వెళ్తుండగా మానకొండూర్‌లో ముందుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. బస్సులో ప్రయాణిస్తున్న మణికంఠ, భారతి, రజితకు స్వల్ప గాయాలయ్యాయి. వీరు వేములవాడ దైవ దర్శనానికి వెళ్లి తిరిగివస్తుండగా గాయపడ్డారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని శుక్రవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రవి తెలిపారు. అనుమతి లేకుండా ట్రాక్టర్లతో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గుండారపు కుమారస్వామి, తాళ్లపల్లి సమ్మయ్య, జమ్మికుంట మండలం తనుగుల గ్రామానికి చెందిన పైడిపల్లి మహేష్, గంగ్రపల్లి గ్రామానికి చెందిన లింగంపల్లి పాపరావుకు చెందిన ట్రాక్టర్లను పట్టణంలోని ఎఫ్‌సీఐ వద్ద పట్టుకున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

గంగాధర: కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి మధురానగర్ చౌరస్తా సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మధురానగర్ నుంచి కారులో కరీంనగర్ వెళ్తున్న వ్యక్తి ముందుగా వెళ్తున్న బైక్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన మామిడి ఐలయ్య(51) తీవ్రంగా గాయపడ్డాడు. కాలు నుజ్జునుజ్జు కావడంతో పాటు చేయి విరిగింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వంశీకృష్ణ పేర్కొన్నారు.